



ప్రభుత్వాసుపత్రుల్లో ప్రోత్సాహమేది ?

- సాధారణ ప్రసవాలపై తగ్గిన ప్రచారం
- లబ్ధిదారులకు అందని ఆర్థిక ప్రయోజనం
- మూడేళ్లుగా పెండింగ్‌లోనే వ్యవహారం
- సర్కారు మారడంతో మరింత సంక్లిష్టం
- అంతా గందరగోళం.. అయోమయం
- నిధుల కొరతనే అసలు కారణమా ?
- కొత్త సర్కారుపైనే కోటి ఆశలు

నిర్మల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రసవాలపై ప్రచారం తగ్గిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందు కోసం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం గందరగోళంగా మారింది. గత నాలుగు సంవత్సరాల నుంచి నిధులు విడుదలకాకపోవడంతో లబ్ధిదారులంతా ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తూ అలసిపోయారు. కొద్ది రోజులు మాత్రం ఆర్భాటంగా అమలు చేసిన ఈ పథకాన్ని క్రమంగా నిధుల కొరత పేరిట అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. కేవలం ఫోటోలు, ప్రచారానికే పరిమితమైన ఈ పథకం ఆచరణలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయకపోవడంతో దీని అమలు అస్తవ్యస్థమైంది. అయితే ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు పెరిగిన కారణంగా సాధారణ ప్రజలు ఇటువైపే వచ్చారు. ఈ పథకం కింద నవజాత శిశువుకు అవసరమైన వస్తువులతో పాటు ఆర్థికసహాయం కూడా మొదట్లో అందించారు. మొదట్లో కొంత మేరకు సక్రమంగా అమలైన ఈ పథకం రాను రాను నీరసించి పోయింది. ముఖ్యంగా గత నాలుగు సంవత్సరాల నుంచి కేవలం సామాగ్రిని మాత్రమే పంపిణీ చేస్తూ ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. కేసీఆర్ కిట్ పేరిట ఉన్న ఈ పథకాన్ని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చి అమలు చేయాలని నిర్ణయించింది. మొదట 2017 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.12వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేసేందుకు నిర్ణయించారు. మొత్తం నాలుగు విడతల్లో ఈ నిధులను జమ చేయాలని నిర్ణయించారు. మొదట్లో ఈ ప్రక్రియ సజావుగానే సాగింది. సబ్బులు, నూనె, దోమ తెర, రెండు జతల దుస్తులు, చిన్న పరుపు, రెండు చీరలు, టవాల్స్‌తో పాటు తదితర సామాగ్రిని ఈ కిట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని మొదట్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. అయితే గత మూడు సంవత్సరాల నుంచి నిధుల కొరత కారణంగా ఆర్థిక సహాయాన్ని స్తంభింపజేసి కేవలం కిట్‌లను మాత్రమే పంపిణీ చేశారు. దీంతో ప్రసవాలు జరిగిన మహిళలు ఆర్థిక సహకారం కోసం ఎదురుచూస్తున్నప్పటికి ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిధుల కొరతనే అసలు కారణం

2022-2023, 2023-2024 సంవత్సరానికి గాను దాదాపు 8వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2022-2023 సంవత్సరానికి సంబంధించి 4919 ఎఎన్‌సీ, 4072 డెలవరీ, 5765 ఇమ్యూనైజేషన్‌లకు సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉండగా 2023-2024 సంవత్సరానికి సంబంధించి ఎఎన్‌సీ 2338, డెలవరీ 2321, ఇమ్యూనైజేషన్ 3319 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. వీటికి సంబంధించి లక్షల రూపాయలు అవసరం ఉండగా ప్రభుత్వం మాత్రం నిధులను విడుదల చేయపోతుండడంతో లబ్దిదారులంతా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా కొత్తప్రభుత్వం పథకం పేరును మార్చినప్పటికి నిధుల విషయంలో మాత్రం చర్యలు తీసుకోకపోతుండడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వాసుపత్రుల పనితీరును మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రకాల సంస్కరణలు చేపడుతున్న నేపథ్యంలో ఈ పథకానికి కూడా ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు.

సమన్వయం లోపం

కాగా ఈ పథకం అమలులో మొదటి నుంచి సమన్వయం లోపం ఆటంకాలకు కారణమవుతోందని అంటున్నారు. డీఎంఈ, డీయంఅండ్‌హెచ్‌ఓల పరిధిలోని ఆసుపత్రుల వ్యవహారంలో అనేక నిబంధనలు ఆటంకం కలిగిస్తున్న కారణంగా ఈ పథకం అమలుపై మొదటి నుంచి సమన్వయం లోపం ఏర్పడిందని అంటున్నారు. దరఖాస్తులు స్వీకరించడం నుంచి మొదలుకొని వాటిని పరిశీలించే స్థాయి వరకు సాంకేతిక పరమైన, పరిపాలన పరమైన ఆటంకాలు తలెత్తిన కారణంగా పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయంటున్నారు. అయితే రెండేళ్ళ పాటు సక్రమంగా కొనసాగిన ఈ పథకం ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయకపోవడం, ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ లోపం ఏర్పడిన కారణంగా ఇప్పటి వరకు ఆటంకాలు యధావిధిగా కొనసాగుతున్నాయంటున్నారు.

కొత్త సర్కారుపైనే ఆశలు...

కాగా ఇటీవలే రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి పాత స్కీంల పేర్లను మార్చేసి కొత్త స్కీంలుగా అమలు చేసేందుకు కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగానే కేసీఆర్ కిట్ పేరును కూడా మార్చేసిన ప్రభుత్వం ఇంకా ఆ పథకం అమలుపై పకడ్బంధీ కార్యాచరణ రూపొందించలేదు. ఇప్పటికే ఈ పథకం పరిధిలో ఆర్థిక సహకారం కోసం వందలాది మంది లబ్దిదారులు అతురతగా ఎదురుచూస్తున్నారు. వీరంతా కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల బకాయిలను కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేసి తమకు తోడ్పాటును అందించాలంటూ కోరుతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందన్న ఆశతో తాము అప్పులు చేశామని కనీసం ఆ అప్పులు తీర్చేందుకైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొత్త ప్రభుత్వం మరింత ఆర్థిక సహకారం పెంచి పథకం రూపురేఖలు మార్చాలని కూడా పలువురు కోరుతున్నారు.

మహాశివరాత్రికి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



ఏర్పాట్లపై చర్చిస్తున్న కాల్వ దేవస్థానం పాలకవర్గం

దిలావర్‌పూర్, మార్చి 4 : మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లను చేయాలని ప్రసిద్ధ కాల్వ పుణ్యక్షేత్ర దేవస్థాన కమిటీ తీర్మానించారు. ఛైర్మన్ వుజరం మహేష్ అధ్యక్షతన సోమవారం లక్ష్మినరసింహస్వామి దేవస్థాన ఆలయ కమిటీ పాలక మండలి సమావేశం జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పూదరి శ్రీను, ఏలేటి పీత్రంరెడ్డి, పోటూరి శ్రీనివాస్ రెడ్డి, గుమ్ముల చిన్ననర్సయ్య, అర్చకులు రాము, శ్రీనివాస్, వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలకు దరఖాస్తు చేసుకోండి : ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, మార్చి 4 : ప్రభుత్వ అందించే ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలకు ప్రజాపాలన సేవా కేంద్రంలోని ప్రత్యేకకౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ ప్రజలను కోరారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 200ల యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ పొందే అవకాశం ఉంటుందని, అర్హులైనవారు ఉపయోగించుకోవాలన్నారు.

పోలియో చుక్కలపై ఆరాతీసిన స్టేట్ టీం



మహాగాంలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలను వేస్తున్న వైద్యాధికారిణి

భైంసా రూరల్, మార్చి 4 : ఆదివారం ప్రారంభించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారో లేదో అని సోమవారం స్టేట్ టీం ఆరా తీశారు. సోమ, మంగళవారం ఇంటింటికి వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలను వేయాలని సూచించారు. మండలంలని ఇటుక బట్టీల్లో, కార్మిక వాడలకు వెళ్లి పోలియో వివరాలను కార్మికులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్లు పృథ్వీరాజ్, డేవిడ్, డీఐవో నైనారెడ్డి, సీహెచ్‌వో గిరిబాబు, డీపీఎంవో గంగన్న, హెచ్‌ఈవో సలీం, హెచ్‌ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వీరబ్రహ్మేంద్రస్వామి బుర్రకథ



నిర్మల్ కల్చరల్, మార్చి 4 : నిర్మల్ పట్టణం గాయత్రినగర్‌లో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బుర్రకథ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రపై నిజామాబాద్ జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ స్వామి బృందం చెబుతున్నారు. కళాకారులు టేకుపల్లి రాందాస్, కాశీలింగం ఆనంద్, ఎల్దీ రాజేశ్వర్, నవీన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు

• భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం, మార్చి 4 : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం గ్రామాల్లో భూమిని కేటాయించడం జరుగుతుందని, అలాంటి భూమిని ఆక్రమిస్తే భవిష్యత్తులో అభివృద్ధి పనులు చేపట్టాలంటే స్థలం లభించక అభివృద్ధి కుంటుపడుతుందని సూచించారు. కుల మతాలకు అతీతంగా గ్రామాల్లో ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలన్నారు. లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామంలో గత కొంత కాలంగా గ్రామంలోని ప్రభుత్వభూమి విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు, ముస్లిం కమిటీ సభ్యులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో సోమవారం భైంసా ఆర్డీవో లోకేశ్వరం తహసీల్దార్ మోతిరామ్‌తో కలిసి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి, ఆ స్థలంలోకి ఇరువర్గాల వారు ప్రభుత్వ అనుమతి లేనిది వెళ్లకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై దిగంబర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకిషన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



తానూర్, మార్చి 4 : మండలంలోని ఉమ్రి గ్రామంలో కదం గంగాధర్ అనే రైతుకు సంబంధించిన పత్తి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం... తన స్వంత చేనులో ఏర్పాటు వ్యవసాయ పనుల నిమిత్తం పంట నిల్వల కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్డులో పత్తి నిల్వ ఉంచాడు. ఆదివారం రాత్రి సమయంలో షార్ట్‌షర్క్యూట్ సంభవించడంతో షెడ్డులోని దాదాపు 50క్వింటాళ్ల పత్తి, వ్యవసాయ పనిముట్లు కాలిపోయినట్లు, తెలిపారు. ఆర్ఐ సమాచారం అందించగా ఆర్ఐ మనోహర్ వచ్చి ఆస్తినష్టం అంచనా వేశారు. సుమారు 4లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు పంచనామ నిర్వహించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పాటిల్ పత్తి కాలిపోయిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈయన వెంట మాజీ ఎంపీటీసీ మధు పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ గోవింద్‌పటేల్, సీనియర్ నాయకులు శ్యాంరావుపాటిల్ తదితరులున్నారు.

'తుడుందెబ్బ నేతల అరెస్టు అప్రజాస్వామికం'

నిర్మల్ అర్బన్, మార్చి 4 : పీఎం నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అధికారిక పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్‌ని ఇతర జిల్లా, మండల నాయకులను రాత్రి మూడు గంటలకు పోలీసు అక్రమంగా అరెస్టు చేసి తమ కస్టడీలో ఉంచుకోవడం దుర్మార్గపు చర్య అని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, మొసలి చిన్నయ్య అన్నారు. ప్రజాపాలన అంటే అర్ధరాత్రి బందిపోట్లలా ఆదివాసీ ప్రజాస్వామిక నేతలను అరెస్టు చేయటమా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఆదివాసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి ఆదివాసీలకు ఏం సంకేతాలిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. నాటి బీఆర్ఎస్ పాలన విధానాలే నేడు కాంగ్రెస్ అవలంబిస్తోందన్నారు. తుడుందెబ్బ ఆదివాసీలకు జరిగే అన్యాయాల పట్ల ఎంత నిర్బంధం ఎదుర్కోనైనా పోరాటాలకు సిద్ధం అవుతుందన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి



సమస్యలు వింటున్న కలెక్టర్

కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, మార్చి 4 : ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో దరఖాస్తుల పరిశీలన చేపట్టి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాబోయే వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ధరణి, రెవెన్యూ, కొత్తరేషన్ కార్డు, పింఛన్లు, భూ తదితర సమస్యలపై అర్జీలు అందినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో గంగయ్య, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఆర్డీవో విజయ లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబానికి చెక్కు అందజేసిన ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 4 : జిల్లా ఎస్పీ జానకి షర్మిల సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబానికి పోలీసు భద్రత చెక్కును అందజేశారు. మామడ మండలంలో ఇటీవల హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో ఆకస్మికంగా మృతి చెందాడు. కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 2023 అక్టోబరు 27న మృతి చెందాడు. ఆయన సతీమణికి పోలీసు భద్రత పథకం ద్వారా 7,56,881 రూపాయలతో పాటు ఇతర పథకం క్రింద అరవై వేల రూపాయల చెక్కును ఎస్పీ అందించారు. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వం తరపున రావలసిన సౌకర్యాలు అందించేందికు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏవో యూనుస్ అలీ, పోలీసు అధికారుల సంఘ ప్రతినిధి విరాసత్ అలీ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

ప్రజల సౌకర్యార్థమే

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ సత్యనారాయణ



ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ సత్యనారాయణ

ఖానాపూర్, మార్చి 4 : పట్టణ ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యనారాయణ తెలిపారు. సోమవారం ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోని వారంతా తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న ఆరు గ్యారంటీల కోసం ఈసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. గృహజ్యోతి పథకంలో జీరో బిల్ రానివారు సైతం ఈసేవ కేంద్రంలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, వైస్ ఛైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్స్, నాయకులు కురుమ శ్రీనివాస్, జన్నారపు శంకర్, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, షబ్బీర్ పాషా, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, తదితరులున్నారు.

మండల కేంద్రం కుంటాలలో.

కుంటాల, మార్చి, 4 : మండల కేంద్రం కుంటాలలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఇంచార్జీ ఎంపీడీవో రహీం ఆధ్వర్యంలో ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకు చేపట్టిన ప్రజాపాల కార్యక్రమంలో పలు రకాల లబ్దిదారులు వివిధ పథకాలలో లబ్దిపొందని యెడల ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

అలేఖ్య కుటుంబానికి

ప్రభుత్వం సత్వరమే న్యాయం చేయాలి

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్



దాడిలో గాయపడిన రియాన్స్‌తో జాన్సన్ నాయక్

ఖానాపూర్, మార్చి 4 : గత నెల 8వ తేదీన ఖానాపూర్‌లో పట్టపగలే నడి రోడ్డుపై హత్య చేయబడిన అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం సత్వరమే న్యాయం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యాజాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ నగర్‌లోని అలేఖ్య నివాసానికి వెళ్లిన జాన్సన్‌నాయక్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన ఘటనపై కుటుంబ సభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన జాన్సన్ గాయాల బారిన పడి కోలుకుంటున్న రెండున్నర చిన్నారి రిమాన్స్‌కు ఆయన గాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గతంలో తమ ప్రభు త్వ హయాంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ముఖ్యమంత్రి సత్వరమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేసే వారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి అలేఖ్య కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రేమ పేరిట ఓ ఉన్మాది చేసిన ఘాతుకానికి అలేఖ్య కుటుంబం తీవ్రంగా నష్టపోయిం దన్నారు. ఒక ఆడబిడ్డను కోల్పోవడమే కాకుండా మరో ఆడబిడ్డ తీవ్ర గాయాలపాలై మంచం పట్టడంతో పాటు ఈ ఘటనలో రెండున్నర ఏళ్ల చిన్నారి సైతం గాయపడడం ఆ కుటుంబాన్ని మానసికంగా తీవ్రంగా కుంగ దీసిందన్నారు. వారికి మనోధైర్యం నింపేలా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వ డంతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ కేసు విచారణలో వేగవంతం కనిపించడం లేదన్నారు. అలేఖ్య కుటుంబానికి న్యాయం జరిగేలా నింది తులకు కఠిన శిక్ష పడేలా వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేప ట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులున్నారు.

సంక్షిప్త సమాచారం

లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, మార్చి 4 : సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విద్యార్థులకు చేరే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కస్బా ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ఆయన ప్రారంభించారు. ప్రతి పాఠ్యాంశం ఇన్స్టాల్ అయినందున ఆకర్షణీయ బోధన చేయవచ్చునన్నారు. దీనిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో శంకర్, హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నిర్మల్ కల్చరల్, మార్చి 4 : జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ఉదయం 10 గంటలకు ఈద్గామ్‌లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి, సంక్షేమ అధికారి వై పి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మంత్రి సీతక్క, ఎంపీ సోయం బాపురావు, జడ్పీ ఛైర్ పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు, విద్యాభిమానులు హాజరై ప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు.

నేడు మున్నూరు కాపు సంఘం

రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య రాక

నిర్మల్ టౌన్, మార్చి 4 : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ మంగళవారం జిల్లా కేంద్రానికి రానున్నారని మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గుమ్ముల అశోక్ మున్నూరుకాపు సంఘం జిల్లా బాధ్యులు ఎంసీ లింగన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలను పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేయనున్న జిల్లా మున్నూరు కాపు సంఘ ఆత్మీయ సమ్మేళనానికి ఆయనతో పాటు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని మున్నూరు కాపు కుల సోదరులందరూ అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పీఎం మోదీ సభకు తరలివెళ్లిన నాయకులు

సారంగాపూర్, మార్చి 4 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన పీఎం నరేంద్ర మోదీ బహిరంగ సభకు సారంగాపూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, హిందూ వాహిని కార్యకర్తలు వాహనాలలో అధికసంఖ్యలో తరలి వెళ్లారు.

తూము గేట్లకు మరమ్మత్తు చేపట్టండి

కుంటాల, మార్చి, 4 : మండల కేంద్రం కుంటాలలో చాలా మంది రైతులకు సంబంధించిన బూర్గు కుంట చెరువు తూము గేట్లకు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ సోమవారం స్థానిక ప్రజా పిర్యాదుల విభాగంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. తూము మరమ్మతు లేకపోవడంతో నీరు వృధాగా వెళ్లిపోయి పంటలు పండడం లేదని అధికారులు స్పందించి ఇకనైనా సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

మోదీ సభకు బయలుదేరిన బీజేపీ నేతలు

కుంటాల, మార్చి, 4 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించతలపెట్టిన ప్రధాని మోదీ సభను కుంటాల మండలంలోని పలు గ్రామాల నుండి భారతీయ జనతాపార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నర్సయ్య మాట్లాడుతూ మరో సారి మోదీని ప్రధానిగా గెలిపించుకోవడమే ధ్యేయంగా ప్రతిఒక్కరు ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ పటేల్, వెంకన్న, బబ్లు శ్రీను తోపాటు పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

కుభీర్ : ప్రధాని మోడి బహిరంగ సభ నేపథ్యంలో సోమవారం కుభీర్ మండల బీజేపీ నాయకులు ఆదిలాబాద్ తరలి వెళ్లారు. బీజేపీ సీనియర్ నాయకులు పుప్పాల లింగం ఆధ్వర్యంలోని నాయకులు రాజు, శేఖర్, శేషు, పుండ్లీక్, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో ఆదిలాబాద్ తరలి వెళ్లారు.

లక్ష్మణచాంద : ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం జరిగిన భారత ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్పసభకు లక్ష్మణచాంద బీజేపీ నాయకులు తరలివెళ్లారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా నరేంద్రమోదీ దేశవ్యాప్త పర్యటనలో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. బయలుదేరి వెళ్లిన వారిలో నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేష్, సురకంటి ముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

ఖానాపూర్, మార్చి 4 : రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దెదించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఖానాపూర్‌లో నిర్వహించిన సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత పదేళ్లుగా దేశంలో రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మూడు రైతు చట్టాలను తెచ్చి ఇటు రైతులను నష్టపరిచిన కేంద్రం కార్మికుల హక్కులను కాల రాసేందుకు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేసిన 700ల మంది రైతులను ఈ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందన్నారు. ఆదిలాబాద్ వచ్చిన మోదీ ఆదిలాబాద్, ఆర్మూర్ రైల్వే లైన్, ఎయిర్‌పోర్ట్, గిరిజన యూనివర్సిటీ, సిమెంట్ ఫ్యాక్టరీల గురించి పట్టించుకోకుండా స్థానిక ప్రజలను అవమానపరిచారని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికుల, రైతుల హక్కులను కాలరాయకుండా ఎంఎస్పీ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు, ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ పాల్గొన్నారు.





• ప్రధానితో సీఎం రేవంత్‌రెడ్డి



• సభావేదికపై ప్రధానితో బీజేపీ నేతలు





విజయ సంకల్ప సభ సక్సెస్

- మోదీ నామస్మరణతో మార్మోగిన సభా ప్రాంగణం
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- మోదీ రాకతో కమలదళంలో కనిపించిన జోష్
- కాషాయమయంగా మారిన జిల్లా కేంద్రం

• విజయ సంకల్ప సభకు హాజరైన బీజేపీ శ్రేణులు, ప్రజలు

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటన సక్సెస్ అయింది. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు భారీగా జనం తరలివచ్చారు. అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేసి ప్రారంభించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ విజయ సంకల్ప బహిరంగ సభలో పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రధాని ఉదయం 10.20గంటలకు జిల్లా కేంద్రానికి రావాల్సి ఉండగా గంట ఆలస్యంగా 11.22 గంటలకు చేరుకున్నారు. ప్రధానికి గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావు, రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయిలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకున్న మోదీ అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేసి ప్రారంభించారు. అధికారిక కార్యక్రమం అనంతరం గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క హైదరాబాద్ తిరిగి వెళ్లారు. ఆ తర్వాత ప్రధాని మోదీ విజయ సంకల్ప బహిరంగసభ వేదికపైకి 12.15గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

• సీపీ, డీజీపీ



ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు పాయల శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, హరీష్‌బాబు శాలువాతో సన్మానించి మెమెంటోలతో సత్కరించారు. 12.28 గంటలకు సభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. 'మేరా భారత్ మహాన్.. మేరా పరివార్' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ విజయ సంకల్ప సభలో నినదించారు. 12.53 గంటలకు ప్రధాని 'భారత్‌మాతాకు జై' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. మోదీ ప్రసంగిస్తున్న సమయంలో సభలోని బీజేపీ కార్యకర్తలు అభిమానులు ప్రజలు కేరింతలతో హోరెత్తించారు. దీంతో మోదీ.. మోదీ అంటూ సభా ప్రాంగణం మార్మోగింది. జిల్లా పోరాట యోధులు రాంజీగోండ్, కొమురంభీం, బాసర జ్ఞాన సరస్వతి ఫొటోలు డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజయ సంకల్ప సభకు నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి దాదాపుగా 40వేల మంది జనం హాజరై ఉంటారని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రధాని, ముఖ్యమంత్రి పర్యటనలో మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమస్యలపై ఊసెత్తని ప్రధాని!

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై మోదీ ఊసెత్తక పోవడంపై జిల్లా వాసులు కొంత నిరాశకు గురయ్యారు. జిల్లా కేంద్రంలోని సీసీఐ, ఎయిర్‌పోర్టు, గిరిజన యూనివర్సిటీ, ఆదిలాబాద్ - ఆర్మూర్ రైల్వేలైన్ పనులకు సంబంధించిన పలు అంశాలను ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల శంకర్ సభావేదికపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా ఏ మాత్రం ప్రయోజనం కనిపించ లేదు. మోదీ జిల్లా సమస్యలపై స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేయలేదు. గతంలో మంజూరైన బోరజ్-బేల రహదారి పనులకు మాత్రమే శంకు స్థాపన చేశారు. కొత్తగా జిల్లాకు హామీలేమి ఇవ్వలేదంటూ సభకు హాజరైన నేతలు, కార్యకర్తలు, జనం చర్చించుకోవడం కనిపించింది.

మోదీ గ్యారెంటీ అంటే.. అమలై తీరుతుంది

- ఆదివాసీల సంక్షేమం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యం
- విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యలు

"నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం" అంటూ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రారంభించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లతో కలిసి అధికారిక కార్యక్రమంలో సుమారుగా రూ.56వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఇది ఎన్నికల సభ కాదు.. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించనే లేదు... మీరందరూ వికసిత్ భారత్ కోసం సభకు తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. మోదీ గ్యారెంటీ అంటే ఖచ్చితంగా అమలై తీరుతుందని, వచ్చే ఎన్నికల్లో 400 సీట్లకు పైగా లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మోదీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏమి జరగదని బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అన్నారు. హైదరాబాద్‌లో రాంజీగోండు పేరుతో మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా ఏడు టెక్స్‌టైల్స్ పార్కులను మంజూరు చేసి తెలంగాణ రాష్ట్రానికి ఒకటి కేటాయించామన్నారు. పత్తి ధరను పెంచి మద్ధతు ధరను కల్పిస్తున్నామని, సమ్మక్క-సారక్క గిరిజన యూనివర్సిటీ, రైతుల కోసం పసుపు బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుదన్నారు. బీజేపీ అధికారంలోకి రాక ముందు ఆదివాసీ మహిళా రాష్ట్రపతి అవుతుందని ఎవరైనా ఊహించారా? భగవాన్ బీర్సా ముండా జయంతిని జాతీయ పండుగగా జరుపుకుంటారని ఎవరైనా అనుకున్నారా అని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని తెలిపారు. గిరిజన సమాజంలో చెంచు, కోలాం, కొండారెడ్డి, తోటి కులాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వారి సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం పీఎం జన్మాన్ పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ పథకం కింద రూ.24 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఈ సందర్భంగా ప్రధాని మోదీ తెలిపారు.



• సీఎంకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్



రాష్ట్ర అభివృద్ధికి మోదీ పెద్దన్నలా సహకరించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే ప్రజలకు నష్టం: సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్దన్నలా ప్రధానిమోదీ సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రధాని మోదీతో కలిసి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా అధికారిక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే ప్రజలకే నష్టం కలుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని.. ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని రాకను రాష్ట్రంలోని 4కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో, మూసినది అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





• గవర్నర్‌కు పూలమొక్క అందజేస్తున్న మంత్రి సీతక్క

జిల్లా కేంద్రంలో కాషాయ జెండాల రెపరెపలు..

ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, రహదారులను కాషాయ జెండాలు, తోరణాలతో నింపేశారు. కలెక్టర్‌చౌక్ నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపులా బీజేపీ నేతలు పోటా పోటీగా భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్‌చౌక్, జగ్జీవన్‌రాం చౌక్, కొమురంభీం చౌక్‌లు కాషాయ జెండాలతో నిండిపోయాయి. ఎటు చూసినా కాషాయమయంగానే మారింది. సభా ప్రాంగణంలోనూ కాషాయ జెండాలను ఎగరవేస్తూ 'జై మోదీ... జై శ్రీరాం' అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

జిల్లా సమస్యలను పరిష్కరించండి..

: సోయం బాపురావు (ఎంపీ, ఆదిలాబాద్)



తలమడుగు : ఎన్నో ఏళ్లుగా జిల్లాలో పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎంపీ సోయం బాపురావు ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లారు. 41ఏళ్ల తర్వాత ఆదిలాబాద్‌పై ఉన్న అభిమానంతో ప్రధాని నరేంద్ర మోదీ జిల్లాకు రావడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ, గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయాలన్నారు. అలాగే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీఐ పునరుద్ధరణకు సహకరించండి..

: పాయల శంకర్ (ఎమ్మెల్యే, ఆదిలాబాద్)



జిల్లా కేంద్రంలో మూతబడిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విజయ సంకల్ప యాత్ర సభలో పాల్గొన్న ప్రధాని మోదీ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. మోదీ జిల్లాకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సుమారుగా 5వేల మందికి ఉపాధిని కల్పించే సీసీఐ సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించి టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగు పడే విధంగా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

ఇది ముమ్మాటికీ ఎన్నికల ప్రచారమే..

• మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 4: జిల్లా కేంద్రంలో నరేంద్రమోదీ నిర్వహించిన సభ ముమ్మాటికీ ఎన్నికల ప్రచారమేనని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభకు హాజరైన ప్రధాని నరేంద్రమోదీ జిల్లా ప్రజలకు మరోసారి అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ నుంచి శంకుస్థాపన చేస్తానని వచ్చిన ప్రధాని పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రచారం నిర్వహించారని అన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా ప్రజల మనోభావాలను మరోసారి ప్రధాని దెబ్బతీశారని అన్నారు. సీసీఐ పరిశ్రమతో పాటు ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటుతో పాటు టెక్స్‌టైల్ పార్కు నిర్మాణంపై ఎంతగానో ఎదురు చూస్తున్న ఆదిలాబాద్ ప్రజానీకానికి వాటిపై ఏ మాత్రం స్పందించకుండా జిల్లా ప్రజలను నిరాశపరచారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ సంకల్ప సభ కాదు ప్రజలను నిరాశ పుచ్చిన సభ అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఓట్ల కోసమే ఈ సభ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాపై మోదీకి కనీస కనికరం లేక పోవడం ఈ సభ నిదర్శనమన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

• రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి, మార్చి 4: ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండో రోజు మండల కేంద్రంలోని పర్వాన్‌గూడ గ్రామాన్ని సందర్శించి అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్ సుభద్ర, ఆశా వర్కర్ అనిత తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

• పంచాయితీ రాజ్ శాఖ డీఈ రమేష్



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ రమేష్

ఇంద్రవెల్లి, మార్చి 4: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలను సందర్శించి ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో ఇంద్రవెల్లి మండలానికి రూ.2 కోట్ల75 లక్షల నిధులతో సీసీ రోడ్డు మంజూరయ్యాయని తెలిపారు. కాంట్రాక్టర్లు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నాసిరకం పనులు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే బిల్లులు కట్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, నాయకులు సోమోరే నాగోరావు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

ఉట్నూర్, మార్చి 4: మండలంలోని ఎందా గ్రామంలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో కలిసి సోమవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదితో పాటు తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాథోడ్ గోకుల్ తదితరులు పాల్గొన్నారు.



ఎందా ఆశ్రమ పాఠశాలలో ఉదయం అల్పాహారాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క